

# చెంగున గెంతులు
SONGS OF FUN & GAMES FOR CHILDREN

# రంగుల మబ్బులు
SONGS OF NATURE FOR CHILDREN

# జేజి మామయ్య పాటలు
FOR CHILDREN

*Produced by*

Saptaparni

NADAVINODINI

# చెంగున గెంతులు

## రంగుల మబ్బులు

### జేజ మామయ్య పాటలు

పూర్వకాలంలో బాలబాలికల చిత్తవృత్తులకు అనుగుణంగా ఉన్న సారస్వతం ప్రచారంలో ఉండేది. లిఖిత రూపంలో లేని ఈ సారస్వతం, ఆ నోటి నుంచి ఆ నోటికీ ఒక తరం నుంచి మరొక తరానికీ అందించ బడుతుండేది. తండ్రులు, తాతలు, తల్లులు, అమ్మమ్మలు, నాయనమ్మలు తాము చిన్నతనంలో నేర్చుకున్న ఆటపాటలను పిల్లలకు నేర్పించి, వారిని ఆడిస్తూ పాడిసూ ఆనందిస్తుండేవారు.

ఇంగ్లీషు చదువులు వచ్చాక , పెద్దలు మనకి వదలి వెళ్ళిన బాల గేయి సాహిత్య సంపద చాలావరకు మరుగునపడి పోయింది. కాలక్రమేణా సామాజిక వ్యవస్థలో వచ్చిన మార్పులవల్ల ఈనాటి బాలబాలికలకు ఉపకరించే, ఆధునిక బాలగేయ సాహిత్యం కూడా వస్తూనే ఉంది. పసిపిల్లల మనసుల్లో సాంస్కృతిక బీజాలు నాటే పాటలు ఎన్నెన్నో ఉన్నాయి.

బాలలకు ఆటపాటలుతో కూడిన విజ్ఞానాన్ని అందిస్తే వారి మానసిక వికాసానికి ఎంతగానో తోడ్పడ గలదనే నమ్మకంతో, ప్రాచీన ఆధునిక బాలగేయ సారస్వతం నుండి ఆణిముత్యాలు కొన్నింటిని ఏరి సీడీల రూపంలో 'సప్తపర్ణి', 'నాదవినోదిని' సంయుక్తంగా సమర్పించే ఈ బాలగేయ మంజరి ని మీరు ఆదరించి ప్రోత్సాహం అందిస్తారని మా ఆశ .

ఈ సీడీలలోని కొన్ని పాటలు చాలా వరకు పూర్వకాలం నుంచి వినవస్తున్న పాటలే! ఇంత అందమైన పాటలు ఎవరు వ్రాసారో కూడా తెలియదు. అందువల్ల వారి పేర్లను ఇందులో పొందుపరచలేక పోయాము. శ్రీ బాలాంతపు రజనీకాంతరావు వ్రాసిన 'జేజ మామయ్య పాటలు', శ్రీ పాలగుమ్మి విశ్వనాథం, కవిరావు, నాయిని సుబ్బారావు, మున్నగు ప్రఖ్యాత ఆధునిక కవులు రచించిన పాటలు 'రంగుల మబ్బులు', 'చెంగున గెంతులు' అనే శీర్షికతో ఈ సీడీలలో పాటల రూపములో పొందుపరిచాము.

# చెంగున గెంతులు

## సూచిక


| నెం. | మొదటి పంక్తి | | పేజ్ నెం. |
|---|---|---|---|
| 1. | కోడీ కోడీ | ... | 4 |
| 2. | ఒక్కాయి ఒక్క | ... | 4 |
| 3. | ఒక్క ఓ చెలియ | ... | 5 |
| 4. | కొండ మీద వెండి గిన్నె | ... | 6 |
| 5. | కాళ్ళా గజ్జి | ... | 7 |
| 6. | గుడుగుడు కుంచం | ... | 8 |
| 7. | అగిచీబుగిచీ | ... | 9 |
| 8. | నూకలు పెడతా | ... | 10 |
| 9. | విద్దెం , విద్దెం | ... | 10 |
| 10. | అమ్మలగన్న నాన్న | ... | 11 |
| 11. | పొట్టేళ్ల కన్న తల్లి | ... | 12 |
| 12. | తాతోయ్ పీతోయ్ | ... | 12 |
| 13. | బావా బావా పన్నీరు | ... | 13 |
| 14. | ఎగిరేజట్కాబండి | ... | 14 |
| 15. | గంగమ్మా గౌరమ్మా | ... | 15 |
| 16. | నీరుచల్లిన ముంగిట్లో | ... | 16 |
| 17. | దూ దూ దూ దూ | ... | 17 |
| 18. | గాలిపటం | ... | 18 |
| 19. | రైలు బండి | ... | 19 |
| 20. | తాటాకు బొమ్మకు | ... | 20 |
| 21. | అలుసుగా నన్నైతే | ... | 22 |
| 22. | మా అమ్మ ఒడి | ... | 23 |

# రంగుల మబ్బులు

## సూచిక


| నెం. | మొదటి పంక్తి | | పేజ్ నెం. |
|---|---|---|---|
| 1. | ప్రొద్దున్నె లేద్దామా | ... | 24 |
| 2. | చల్లగాలి వచ్చింది | ... | 25 |
| 3. | మబ్బు కన్నియల | ... | 26 |
| 4. | ఏరువాక వచ్చింది | ... | 27 |
| 5. | పన్నెండు ధాన్యాలు | ... | 28 |
| 6. | నాటేరమ్మ | ... | 29 |
| 7. | పండ్లోయమ్మ | ... | 30 |
| 8. | జొన్నల్లో పుట్టిన | ... | 31 |
| 9. | కోలుపలుకులు | ... | 32 |
| 10. | గంగమ్మ తల్లికి | ... | 33 |
| 11. | ఎందుకురా | ... | 33 |
| 12. | నెలవంక పడవ | ... | 34 |
| 13. | ఏలేలో హైలేసా | ... | 35 |
| 14. | చందమామ రావే | ... | 36 |
| 15. | నెలనెలకు బాలుడవై | ... | 37 |
| 16. | కిలకిల నవ్వులు | ... | 38 |




# జేజి మామయ్య పాటలు

## సూచిక


| నెం. | మొదటి పంక్తి | | పేజ్ నెం. |
|---|---|---|---|
| 1. | రారె చిన్ని పిల్ల లారా | ... | 39 |
| 2. | కాకీ , కాకీ , హోష్ | ... | 40 |
| 3. | మ్యావు మ్యావు పిల్లీ | ... | 41 |
| 4. | పాలపిట్ట రావే | ... | 41 |
| 5. | ఉడతా ఉడతా | ... | 42 |
| 6. | బాతు నేస్తం | ... | 43 |
| 7. | కర్ర గుర్రం | ... | 44 |
| 8. | మూడు చక్రాల సైకిల్ | ... | 45 |
| 9. | గాలిపటం | ... | 46 |
| 10. | బొంగరం | ... | 47 |
| 11. | ఆటలు ఆడి | ... | 48 |
| 12. | చందమామ బోటు | ... | 48 |
| 13. | చలి చలి | ... | 49 |
| 14. | భోగిపళ్లు | ... | 50 |
| 15. | పల్లకీ పాట | ... | 51 |
| 16. | బొమ్మల కొలువు | ... | 51 |
| 17. | కాగితపు పడవ | ... | 53 |
| 18. | కప్పల బడి | ... | 54 |
| 19. | వంకరటింకర సో | ... | 55 |
| 20. | చెడుగుడు | ... | 56 |

# చెంగున గెంతులు

## 1. కోడీ కోడీ

సాంప్రదాయ గీతం — గానం ॥ సాహితి

కోడీ కోడీ కొక్కు రో కో !
కాకీ కాకీ కావ్ కావ్ !
తెల్లవారింది తెలివొచ్చింది
అమ్మ లెమ్మంది ఆడు కొమ్మందీ ॥

## 2. ఒక్కాయ ఒక్క

సాంప్రదాయ గీతం — గానం ॥ సాయిదరహాస్

ఒక్కాయ ఒక్క - రెక్కాయ రెట్టి
ముక్కాయ మువ్వ - నక్కాయనంది
అయిదుం బొడ్డు - అరింకతాళ
ఏ శాబొద్దు - ఎడమాకన్ను
తొంబాపరక- తొట్టికంగి ॥



## 3. ఒక్కా ఓ చెలియా

సాంప్రదాయ గీతం — గానం ॥ లావణ్య , సాహితి

॥ ప ॥ ఒక్కా ఓ చెలియా - రెండు రేగుక్కూ
మూడు ముచ్చిలకా - నాలుగు నందన్నా ॥

॥ చ ॥ అయిదు చిట్టి గొలుసు
ఆరందవ్వాళి ఏడుకుబేటిలు
ఎనిమిది మన మంద
తొమ్మిది తోక్కుచ్చు - పదికీ పట్టెడ ॥

॥ చ ॥ పడమటి గుడి చిలక కన్నా రెండాయె
కాక్కి కరకంచు - పిచిక్కి నీరంచు
అమ్మకు బొమ్మంచు - అయ్యకు జామారు
నాకు పట్టంచు చెల్లెలు చేమంతి
తమ్ముడు తలపాగా మరదలకాభరణం ॥

# 4. కొంద మీద వెండిగిన్నె

సాంప్రదాయగీతం గానం ॥ సాయిదరహాస్ , లావణ్య , సాహితి

॥ ప ॥ కొండ మీద వెండిగిన్నె కొక్కిరాజుకాలువిరిగె
దానికే మి మందు ?

॥ చ ॥ వేపాకు చేదు వెల్లుల్లిగడ్డ
నూనెలోని మడ్డి నూటొక్కసారి
పూయవోయినూరి పూటకొక్కతూరి ॥

॥ చ ॥ కొండ మీద గుండు
జారి కొక్కిరాజు కాలువిరిగె - దానికేం మందు
వెల్లుల్లిరేక - నూనెమ్మబొట్టు - నూటొక్కధార ॥

॥చ ॥ కొండ మాద వెండిగిన్నె కొక్కి రాజు కాలువిరిగె
విరిగి విరిగీ రెండాయె - వీధుల్లో మూడాయె
పడమటి చుక్కలు పండాయి భళ్లు భళ్ళున తెల్లవారింది ॥



# 5. కాళ్ళ గజ్జె - కంకాణమ్మా

సాంప్రదాయ గీతం గానం ॥ టి.కె. తేజస్వి

కాళ్ళ గజ్జె - కంకాణమ్మా
వేగులచుక్కా - వెలగామొగ్గా
మొగ్గాకాదు - మోదుగనీరు
నీరు కాదు నిమ్మలవారి
వారి కాదు వావింటకూర
కూరకాదు గుమ్మడి పండు
పండు కాదు పాపిడి మీసం
లింగులిటుకు పంది మల్లిపట్టుకు
రాజుగారి తోటోలో ఏముందంటే
పువ్వో మొగ్గో పుచ్చుకుంటే దెబ్బ
కాలు తీసి పక్కన పెట్టు
రింగు రింగు బిళ్ళ రూపాయిదండ
దండ కాదు తామర మొగ్గ
మొగ్గ కాదు మొదుగ నీరు
నీరు కాదు నిమ్మలబావి
బావి కాదు బచ్చలి కూర
కూర కాదు కుంకుమ మెట్టు
మెట్టు కాదు మేదర ఇల్లు
ఇల్లు కాదు ఈగలతుట్ట
కాలుతీసి కడకుపెట్టు

# 6. గుడు గుడు కుంచం

సాంప్రదాయగీతం　　　　గానం ॥ శ్రావణి, ఆకాంక్ష

॥ ప ॥ గుడు గుడు కుంచం గుండే రాగం
పాముల పట్టం పడగా రాగం ॥

॥ చ ॥ అప్పల రాజు గుర్రం ఆడుకోబోతే
పే పే గుర్రం పెళ్ళికి పోతే
నీ గుర్రం నీళ్ళకు పోతే
నా గుర్రం పాలకు పోతే
కత్తెయ్యనా బద్దెయ్యనా
వేన్నీళ్లా చన్నీళ్లా ?

॥ చ ॥ గుడు గుడు కుంచం గుండే రాగం
పామం పట్టం పడగారాగం ॥

॥ చ ॥ అప్పలరాజు గుర్రం ఆడుకోబోతే
పేపే గుర్రం పెళ్లికి పోతే
అన్నా ! అన్నా! నీ పెళ్లెపుడంటే
రేపుగాక ఎల్లుండి
కత్తీ కాదు బద్దాకాదు
గప్ చిప్ గప్ చిప్ గప్ చిప్ ॥



# 7. అగిచీ బుగిచీ

సాంప్రదాయ గీతం　　　　గానం ॥ మనస్విని, తేజస్వి

॥ ప ॥ అగిచీ బుజిచీ జండాల
బుగిచీ బుగిచీ బుగిచీ ॥

॥ చ ॥ దగ్గులూరు దవనంకట్ట
నీ కోకట్టా నాకోకట్ట కట్టా కట్టాకట్టా ॥

॥ చ ॥ విశాఖపట్నం వీసెడు బెల్లం
నీ కోపదలం నాకోపదలం - పదలం పదలం పదలం ॥

॥ చ ॥ కళింగపట్నం కాసులపేరు
నీ కోపేరు నాకోపేరు పేరు పేరు పేరు ॥

॥ చ ॥ భీమునిపట్నం బిందెలజోడు
నీకోజోడు నాకోజోడు - జోడు జోడు జోడు ॥

॥ చ ॥ చెన్నపట్నం చెరుకుముక్కా
నీకోముక్క - నాకోముక్క ముక్కా - ముక్కా ముక్కా ॥

॥ చ ॥ అక్కల కర్రా ముక్కాలి పీట
కూర్చోవదినా - వదినా ! వదినా ! వదినా !బబ

## 8. నూకలు పెడతా

సాంప్రదాయ గీతం గానం ॥ అనిరుధ్

నుకలు పెడతా ఏకులు వడుకు
నుకలు ఇస్తా మేకలు కాయ్
అటుకులు పెడతా ఆవుల మేపు
బెబ్బులి వచ్చిన బెదరవుగా
చిరుతలు వచ్చిన భయంలేదుగా
ఎలుగులు వచ్చిన ఏడ్వవుగా
వడగళ్ళు రాలిన వణకవు కాదు
ఎంతధైర్యం ఎంతధైర్యం
ఒక్కసారి చూడవోయ్ ఒక్కసారి ఇటు చూడు - ఉఫ్
'ఉఫ్ ' అంటే నే ఉలిక్కి పడ్డావే
'ఉఫ్ ' అంటే నే ఉలిక్కి పడ్డావే ॥

## 9. విద్దెం విద్దెం

సాంప్రదాయ గీతం గానం ॥ లావణ్య

విద్దెం విద్దెం వరహాల విద్దెం
విద్దెం చేస్తే పోస్తా నెయ్యి
తప్పక చేస్తే తవ్వెడునెయ్యి
మళ్ళీచేస్తే మానెడునెయ్యి
చెప్పుకో చెప్పుకో
చెవులెక్క తీసుకో
మామిడాకిస్తాను మందేసుకో
మామిడాకిస్తాను
మందేసుకో ॥



## 10. అమ్మలగన్న నాన్న

సాంప్రదాయ గీతం గానం ॥ ప్రణవి

అమ్మలగన్న నాన్న - కన్న తల్లుల నాన్న
వజ్రాల తల్లుల నాన్న - వరహాల పేరులనాన్న
పలక బొజ్జల నాన్న - కాసుల పేరులనాన్న
ఇల్లలికీ ముగెట్టి - ఆకేసి పీటేసి
పప్పూపెట్టి - పాయసం పెట్టీ
అన్నం పెట్టి - అప్పచ్చి పెట్టి
కూరపెట్టీ - ఊరగాయ పెట్టి
నెయ్యివేసీ - ముద్దచేసీ
తినిపించీ - తినిపించీ
చెయికడిగీ- మూతికడిగీ
తాతారింటికీ - దారేదంటే
అత్త వారింటికి - దారేదంటే
ఇట్లా పోయి - అట్లాపోయి
ముట్టెత్తు పాలెం ముందట్నించి
ఇట్లాపోయి - అట్లాపోయి
ఇదిగో వచ్చేం - వచ్చేశాం
చక్కావచ్చేం - వచ్చేశాం
చక్కిలి గిలిగిలి - చక్కలిగిలిగిలి
గిలిగిలిగిలిగిలి - చక్కలిగిలిగిలి ॥

## 11. పొట్టేళ్ళ కన్నతలి

సాంప్రదాయగీతం గానం॥ శరత్, సంతోష్ , రోహిత్

॥ ప ॥ పొట్టేళ్ళ కన్నతల్లి - గొర్రే గొర్రే - దున్న
పోతూను కన్నతల్లి - బర్రే బర్రే ॥

॥ చ ॥ ఉమ్మెత్త కాయ తింటే - వెర్రే వెర్రే
మిరపకాయ నమిలితేను - చుర్రే చుర్రే ॥

॥ చ ॥ కాకి రెట్ట బట్టమీద కర్రే కర్రే
బురదలోను కాలేస్తే - పుర్రే పుర్రే ॥

॥ చ ॥ ముందటి పళ్ళూడితేను - తొర్రే తొర్రే
తొర్రెనోట్లో అంబలేస్తే - జుర్రే జుర్రే ॥

॥ చ ॥ పాతగుడ్డ చిరిగితే - పుర్రో పుర్రో
దానిమొగుడు దాన్ని కొడితే - మొర్రో మొర్రో ॥

## 12. తాతోయ్ పీతోయ్

సాంప్రదాయ గీతం గానం ॥ శ్రావణి,ఆకాంక్ష

తాతోయ్ పీతోయ్ - ముంజికాయ్ మూతోయ్
ఉల్లికోడు ఉతోయ్ - తాతోయ్ - తాతా ॥

తాతోయ్ మా ఇంటికి రావోయ్
నీతోటి మాటొక్కటుందోయ్



నీవు కూచుంటే కురిసీల పీటుంది
నీవు నుంచుంటే నిమ్మచెట్టు నీడుంది
నీవు తొంగుంటే పట్టి మంచం పరుపుంది
నీకాకలయితే సన్నబియ్యం కూడుంది
అందులోకి వంకాయ కూరుంది
తాతోయ్ తాతా మా తాతోయ్ తాతా ॥

## 13. బావా బావా పన్నీరు

సాంప్రదాయ గీతం గానం ॥ సింధుజ , ప్రశాంతి

॥ ప ॥ బావా బావా పన్నీరు
బావను పట్టుకు తన్నేరు
వీధి వీధి తిప్పేరు -వీశెడు గుద్దులు గుద్దేరు ॥

॥ చ ॥ పట్టే మంచం వేశారు - పాతిక గుద్దులు గుద్దారు
నులక మంచం వేశారు - నూరు గుద్దులు గుద్దారు ॥

॥ చ ॥ నాగి నాగి నల్లేరు నాగిని పట్టుకుతన్నేరు
వీధి వీధులు తిప్పేరు - ఈ తగంధం పూసేరు
గాది కింద ఏశారు - గంజి మెతుకలు పెట్టారు
మూల ఇంట్లో మూశారు - ముంత పొగలు ఏశారు
పడమటింట్లో ఏశారు - పక్కలిరగ తన్నారు
గూబలుపట్టుకు ఎత్తారు - గుత్తికొండ జూపారు ॥

# 14.ఎగిరే జట్కా బండి

సాంప్రదాయ గీతం　　　　　గానం ॥ రోహిత్, సంతోష్

॥ ప ॥ ఎగిరే జట్కా బండి - నడిచే ఒంటెద్దుబండి
గుర్లెర్ర జేసింది గుర్రంబండీ
ఈ మూడు జాతులు కలుపుకోనీ
ఊడబొడిచిన రైలుబండీ
కమురు కంపు - బొగ్గు నీళ్లు , రైలుబండి ॥

॥ చ ॥ ఉడికే తోటకూర - మొలచే బచ్చలికూర
గుర్లెర్ర జేసింది - గులుగుకూర
ఈమూడు జాతులు కలుపుకోనీ
ఊడబొడిచిన గోంగుర
పీచు పిచు పిచ్చి పులుపు గోంగూర ॥

॥ చ ॥ ఉడికే ఉలవపప్పు - చెరిగే సెనగా పప్పు
కళ్ళెర్ర జేసింది కంది పప్పు
ఈ మూడు జాతులు కలుపుకోనీ
ఊడ బొడిచిన పెసరపప్పు ॥
కమురు కంపు - పిచ్చిరూపు పెసరపప్పు ॥
ఉడబొడిచిన పెసర పప్పు
పిచ్చిరూపు పసుపురంగ పసరపప్పు



# 15. గంగమ్మ గౌరమ్మా

సాంప్రదాయ గీతం　　　　　గానం ॥ సాయిచరిత, మనోజ్ఞ

॥ ప ॥ గంగమ్మ గౌరమ్మా అక్క చెల్లెళ్లు
గొబ్బియళ్లో గొబ్బియళ్లో ॥

॥ చ ॥ ఒకతల్లి పిల్లలకు వైరములేదు
మంచిమంచి పూవులేరి ఒకరాసి పోసిరీ
గొబ్బియళ్లో గొబ్బియళ్లో ॥

॥ చ ॥ కానరాని కలువలేరి ఒకరాసిపోసిరీ
ఏడుమూరలింటిలో ఏడొక్కతూము
గొబ్బియళ్లో గొబ్బియళ్లో ॥

॥ చ ॥ ఏడొక్కతూమేసి ఎల్లాకొలిపించె
పగిడి ఒక తూమేసి పారాకొలిపించె
గొబ్బియళ్లో గొబ్బియళ్లో ॥

॥ చ ॥ గంపెడు తీసేసి గంపకెత్తండీ
మంచి మంచి పూలేరి మామయ్యకంపే
గొబ్బియళ్లో గొబ్బియళ్లో ॥

॥ చ ॥ కానరాని పూలేరి గౌరమ్మకంపే
అక్క చెల్లినీ ఒకరికిచ్చే
గొబ్బియళ్లో గొబ్బియళ్లో ॥

# 16.నీరు జల్లిన ముంగిట్లో

రచన ॥ శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి బృందగానం ॥ యమిని, సింధుజ, తేజస్వి ప్రశాంతి

॥ ప ॥ నీరు జల్లిన ముంగిట్లో - పన్నీరు జల్లిన వాకిట్లో
దారి పొడుగునా ముగ్గుల్లో - ముత్యాలు పోసినా ముగ్గుల్లో
ఆదారి పొడుగునా సొరుగా - ముత్యాల ముగ్గులా గొబ్బిళ్లో
రత్నాల ముగ్గులా గొబ్బిళ్లో ॥

॥ చ ॥ నీరు జల్లిన ముంగిట్లో - పన్నీరు జల్లిన వాకిట్లో
నారుపోసిన ముంగిట్లో - గన్నేరు పూచిన వాకిట్లో
బారు బారుల బంతుల్లో-ఆచేరులై చేమంతుల్లో
బంగారు రేకుల బంతుల్లో - చేమంతు ల్లోపల గొబ్బిళ్లో ॥

॥ చ ॥ నీరు జల్లిన ముంగిట్లో - పన్నీరు జల్లిన వాకిట్లో
నారుపోసిన ముంగిట్లో - గన్నేరు పూచిన వాకిట్లో
జారు జడలా కన్నెల్లు - వయ్యారి నడల కన్నెల్లు
వయ్యారి నడల - జారు జడల ॥
కన్నెలుంచిన గొబ్బిళ్లో ॥



# 17. డూ డూ డూ డూ బసవన్నా

సాంప్రదాయగీతం గానం ॥ సాయిదరహాస్

॥ ప ॥ డూ డూ డూ డూ బసవన్నా
డూ డూ డూ డూ ఎంకన్నా
శివుని మాటకు శిరసాడించి
పార్వతి మురియగ పరుగులుతీసి
విద్దెలు చూపరా పెద్దవారికి ॥

॥ చ ॥ పెబువు గారికి దణ్ణంపెట్టు
పాదంవంచి భక్తిగ పెట్టు
పట్టు శాలువలు కప్పేదరంట
పైడి మువ్వలు కట్టెదరంట ॥

॥ చ ॥ ఎండి కొండల ఈశ్వరు డండి
భమిడి కొమ్ముల బసవయ్యండి
ఏడుకొండల ఎంకన్నండి
ఎంటనే ముడుపులు పట్టుకురండి ॥

॥ చ ॥ ఇంటికొక్కడు ఈరభద్రుడు పంచకొక్కడు బసవేశ్వరుడు
చల్లగవెలసి ప్రభువులువుంటే కళ్లవేడుకలు మనకంతా ॥

# 18. గాలి పటం

రచన ॥ శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి                    గానం ॥ ప్రణవి

॥ ప ॥ వదలండీ గాలిపటం
వదలండీ దారం - వదలండి పాపం
పట్టుకు లాగొద్దనీ - కొట్టుకు పోతోంది ॥

॥ చ ॥ మబ్బుల నొరుసుకు పోయి - మనసాయెనేమొ
చుక్కలను చేరువగా - చూడాలని ఉందేమొ ॥

॥ చ ॥ తలవూపీ తోకూపీ తల్లడిల్లి పోతోంది
మెలికెలుగా ఒళ్ళాంతా - గిల గిల మంటోంది ॥

॥ చ ॥ ఎంతుదో ఆకాశం ఏముందో ఆపైన
దవుదవ్వల పావురాన్ని అడిగి తెలుసుకోవాలని
కోట్టుకు పోతోంది పట్టుకు లాగొద్దనీ ॥



# 19. రైలుబండి

రచన ॥ శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి                    గానం ॥ సంతోష్ ,రోహిత్

॥ ప ॥ పొగలు గ్రక్కుతూ కదిలిందీ
పొగర బోతు పొగబండి
గంతులేస్తు పెదరంకెలేస్తు
తన కంటే జోరుగాపోయేదెవరని ॥

॥ చ ॥ పొలాలనన్నిటి చీల్చుకుంటూ
తోటల తోపులు దూసుకుంటూ
నదులెన్నిటినో దాటుకుంటూ
కొండలు గుట్టలు చుట్టుకుంటు ॥

॥ చ ॥ కునికి పాట్ల రెండెడ్ల బండిని
కుంటి నడక ఒంటెద్దుబండిని
కళ్ళకు గంతల గుర్రపు బండిని
దాని బాబు మోటారు కారుని
సవాలు చేస్తుంది - చివాల్న పోతుంది ॥

॥ చ ॥ అన్నిటినీ సవాలు చేస్తు - అన్నిటినీ వెనక్కి నెట్టుతూ
'ఆ' అంటే ఆమడదాటి - 'కో' ! అంటే కోసులుదాటి
రైలుబద్దెపై మద్దెలుకొడుతూ - తకధిమి తకఝుణు తధిగిణతోం ॥

॥ చ ॥ కూతకూసినా పక్షికాదు -తెగ పొగలు వదిలినాచుట్టకాల్చదు
నొసటి మీద కన్నున్నప్పటికీ - శివుడుకాదు
అది చెప్పుకోండి - మరి చెప్పుకోండి
రైలుబండి అది రైలుబండి ॥

## 20. తాటాకు బొమ్మకు.

సాంప్రదాయ గీతం గానం ॥ మనస్విని,సాయిచరిత,
ప్రశాంతి, యామిని

॥ ప ॥ తాటాకు బొమ్మకు కాటుక బొట్టు పెట్టి
చీరసింగారించి కూసోబెట్టారు
గాజు పూసలపేరు మెళ్ళో వేసారు
గౌరీ కళ్యాణాల రేఖ దిద్దారు ॥

॥ చ ॥ పానకం బిందెలు సిద్ధ పరిచారు
పాపపేరంటాళ్ళు కాచుకున్నారు
లక్క పిడతలో అన్నం ఉడికి పోయింది
లక్క చట్టిలో పప్పు ఉడికిపోయింది ॥

॥ చ ॥ పెళ్ళి కూతురి తండ్రికట్నాలకోసం
చింతగింజల లెక్క పెట్టి దాచాడు
పెళ్ళి హడావుడి జరిగి పోయింది
పెళ్ళి బాజాలు మోగిపోతున్నాయి ॥

॥ చ ॥ పెళ్ళుమన్నవి బాజాలు
మగపెళ్ళివారి బాజాలు
ఝుల్లుమన్నవి హృదయంలోపల
పెళ్లికూతురి కోరికలు ॥



॥ చ ॥ తోటంతా ఒక పందిరి వేసి
బాటంత పన్నీటిని చల్లి
వయ్యారి ముగ్గులు పెట్టేరు
రంగుల ముగ్గులు పెట్టేరు
రంగురంగుల ముగ్గులు పెట్టేరు ॥

॥ చ ॥ చిగురాకుల తోరణాలు కట్టి
చిన్నాపెద్దా జట్టులుకట్టి
పసుపుకుంకుమ పండ్లు పూలు
వడివడిగా పంచేరు ॥

॥ చ ॥ పెళ్లికుతురీ ముద్దుల రాణి
పెళ్లికొడుకు ఇంకారాడేమి
ముస్తాబు పూర్తి కాలెదా
ముసిముసి నవ్వుల పెళ్లికొడుకా బబ

## 21. అలుసుగా

రచన ॥ శ్రీ కవిరావు గానం ॥ సాయిదరహాస్

॥ ప ॥ అలుసుగా నైన్నైతే అంటావుగాని
ఎన్ని జేసినగాని నాన్నారి ననవే ?

॥ చ ॥ నాన్నగారి బల్ల మీద కాగితాలు ఎన్నో వుంటే
గాలిపడగ కోసం ఒక్క కాగితం తీసుకుంటే
కస్సుమంటు నా మాద కోప్పడతావు ॥

॥ చ ॥ నాన్నగారి బుక్కుతీసి చిన్ని పెన్సిలుతోను
అఆలు నేను అందంగా రాస్తే
కర్రెర్ర జేసినన్ను కోప్పడతావు
తెల్లకాగితాలనిండా ఏదో ఏదో రాసేసి
తెగపాడు చేస్తుంటే నాన్నారిననవేం ॥

॥ చ ॥ గొప్ప గొప్ప గ్రంధాలు నాన్న గారివంటూ
కొత్త కొత్త కవితలెన్నో అల్లేరు అంటూ
నాన్న గారినెపుడు పొగిడేస్తు వుంటావు
కమ్మగా నీలాగ కధచెప్పగలరా ?
హాయిగా నీలాగ పాట పాడగలరా ?
అమ్మ నాకు చెప్పవే - ఒకసారి
నాన్నగారి రాతలు నీకర్ధవుతాయా?



## 22. మా అమ్మ ఒడి

రచన ॥ శ్రీ పాలగుమ్మి విశ్వనాధం గానం ॥ ప్రణవి

॥ ప ॥ మా అమ్మ ఒడి నాకు మొదటి బడి
మమతాను రాగాలు మది నిండ నింపి
నను తీర్చిదిద్దింది ఆ బడి ॥

॥ చ ॥ అమ్మ అన్న ప్రతి మాట
నా బ్రతుకున పరిచిందొక బంగరు బాట
అమ్మ పాడిన ప్రతిపాట
నాలోన నాటిందొక పూలతోట ॥

॥ చ ॥ చందమామ చూపిస్తు - మరోముద్ద తినిపిస్తు
ముద్దు ముద్దు మాటలను నా నోటని పలికిస్తు
ఎన్నెన్నొ కధలతో మురిపించేది
నా ఊహల గాలిపటం ఎగరేసేది ॥

॥ చ ॥ తెలివి మాలి ఎపుడైనా - తప్పదోవ పడితే
మెలమెల్లిగ మేల్కొల్పి హెచ్చరించేది
వెలుగుదారివెంట తిరిగి నడిపించేది
వెలలేని ధైర్యాన్ని నూరి పోసేది !

# రంగుల మబ్బులు

## 1. ప్రొద్దున్నే లేద్దామా

సాంప్రదాయగీతం గానం ॥ సాయిచరిత, మనోజ్ఞ

॥ ప ॥ ప్రొద్దున్నే లేద్దామా లేద్దామా
అందరము అటు ఇటు పోయి
అందిన పూలు కోద్దామా ॥

॥ చ ॥ రంగురంగుల పూలన్ని రాసులుగా పోద్దామా
సాలింటి కాడ సన్నదారము తెచ్చి
దాసరింటి కాడ సన్నసూది తెచ్చి
కోసిన రంగుల పూలన్నీ
రాసులు పోసిన పూలన్నీ
రమ్యంగా అందంగా - దండలు గుచ్చుదమా ॥

॥ చ ॥ దేవుడి గుడికి పోదామా
కిరకిర తలుపులు తీద్దామా
చేతిలో వున్న దండలని
దెవుని మెళ్ళో వేద్దామా ॥



## 2. చల్లగాలి వచ్చింది

సాంప్రదాయగీతం గానం ॥ టి.కె. తేజస్వి

॥ ప ॥ చల్లగాలి వచ్చింది బుడుగో బుడుగో
పిల్ల మబ్బు వేసింది బుడుగో బుడుగో
మెరపు కన్నెలొచ్చారు బుడుగో బుడుగో
మద్దెళ్ళ చప్పుళ్ళు బుడుగో బుడుగో ॥

॥ చ ॥ సన్న సన్న చినుకులు బుడుగో బుడుగో
పెద్ద పెద్ద చినుకులు బుడుగో బుడుగో
వానలూ వరదలూ బుడుగో బుడుగో
వరిచేల పంటలు బుడుగో బుడుగో
వరహాల మాటలు బుడుగో బుడుగో ॥

॥ చ ॥ వానల్లు కురవాలి వరిచేలు పండాలి బుడుగో బుడుగో
వడ్లన్ని రావాలి మాకోట్లు నిండాలి బుడుగో బుడుగో
మా నాన్న తియ్యాలి మా అమ్మ కియ్యాలి బుడుగో బుడుగో
మా దాసి దంచాలి మా అమ్మ వండాలి బుడుగో బుడుగో
మా బొజ్జ నిండాలి హాయిగా వుండాలి బుడుగో బుడుగో ॥

## 3.మబ్బు కన్నియలు

రచన ॥ మల్లవరపు విశ్వేశ్వర రావు గానం ॥ యామిని, ప్రశాంతి

॥ ప ॥ మబ్బు కన్నియల గజ్జెలు ఘల్లు ఘల్లు ఘల్లు ఘల్లన
మొదటి మబ్బు తుంపరలై అల్లనల్ల చల్లినా
తనువు పులకరించి ఎడద ఝల్లు ఝల్లు ఝల్లు ఝల్లున
ధరణి మాత సేదదీరె మెల్ల మెల్ల మెల్లన ॥

॥ చ ॥ తొలి వానచినుకులకు తడిసింది నేలా
తడినేల నిట్టూర్చె తన సుగంధాలు
జలజల మని ప్రవహించె సెలయేరులు
తొర తొర తొర మొలకెత్తె గరికపరకలు ॥

॥ చ ॥ కుర్రా పిల్లలు దొరువు నీళ్లు
గుంపులాడిరీ గంతులెసిరీ
కన్నెపిల్లలు ముంగిళ్ళలో - వానావాన వల్లప్పంటూ
తిరుగసాగిరీ ఎన్నో ఆటలాడిరీ
అవ్వలు తాతలూ అరుగులపైచేరీ
వచ్చే పోయే పలకరించిరీ ॥

ఎండలోన వానా- వానాలోన ఎండా
ఎండా వానా ఒక్కసారి వచ్చేవేళా
మంచి పెళ్ళిలగ్నం ఉందంటా ఆవేళా
కుక్కల కూ నక్కలకూ పెళ్ళంటా
పిల్లలంతా పెళ్ళి పెద్దలంటా ॥



## 4.ఏరు వాక వచ్చింది

సాంప్రదాయ గీతం గానం ॥ ప్రశాంతి , యామిని

॥ ప ॥ ఏరు వాక వచ్చింది ఏరువాకమ్మ
ఏళ్ళు నదులు పొంగి ఎంబడొచ్చాయి
ఎంబడొచ్చాయి ॥

॥ చ ॥ నల్ల మేఘాలలో నాట్యమాడింది
కొండ గుట్టల మిద కులుకులాడింది
ఇసుక నదిలో దూరి బుసలు కొట్టింది ॥

॥ చ ॥ ఆడుతూ ఆడుతూ ఆ నెమలి
అలసి పోయింది అలసి పోయింది
నవ్వుతూ నవ్వుతూ మా అయ్య బువ్వతిన్నాడు బువ్వతిన్నాడు ॥

॥ చ ॥ ఆకసాన మబ్బులు అవతరించాయి
ఉరుముక్కటా వేళ ఉరిమిపోయింది
కన్నెపిల్ల మనసు కదిలిపోయింది-కదిలిపోయింది ॥

॥ చ ॥ అటక మీద గంప అందుకోవయ్య
విత్తనాలు తీసి విరజిమ్మవయ్య
మృగశిర కార్తిలో ముంచెత్తువాన
ముత్యాల వాన రత్నాలవాన ॥

॥ చ ॥ కలపర అబ్బాయి కొత్తదూడల్ని
దున్నర ఓరయ్య దుక్కులు మీరు
ఓ గింజ కోటియై వర్ధిల్లు మీకు
ఏరువాకా సాగి ముసురుకోవాలి
కొత్త పంటలతో గాదె నిండాలి ॥

## 5.పన్నెండు ధాన్యాలు

సాంప్రదాయగీతం                    గానం ॥ సాయిచరిత, మనోజ్ఞ

॥ ప ॥ పన్నెండు ధాన్యాలు వానదేవుడా
పంట చేలు పండాలి వానదేవుడా
మా కడుపునిండాలి వానదేవుడా ॥

॥ చ ॥ పారిపోయిన బావ పరిగెత్తుకు రావాలి వానదేవుడా
ఊరికెళ్ళిన బావ ఉరికురికీ రావాలి వానదేవుడా ॥

॥ చ ॥ చేటంత మబ్బు పట్టి చెరువంతా నిండాలి వానదేవుడా
తూరుపునా మబ్బు పట్టి తుళ్ళితుళ్ళి కురవాలి వానదేవుడా ॥

॥ చ ॥ పడమటను మబ్బు పట్టి -పట్టి పట్టి కురవాలి వానదేవుడా
ఉత్తరాన్ని మబ్బు పట్టి - ఉరుమురిమి కురవాలి వానదేవుడా
దక్షిణాన మబ్బు పట్టి -జల్లుజలున్ల కురవాలి వానదేవుడా ॥

॥ చ ॥ కప్ప తల్లి నీళ్లాడి - కడవలన్నీ నిండాలి వానదేవుడా
చేప తల్లి నీళ్లాడి - చెరువులన్నీ నిండాలి వానదేవుడా
కురవాలి కురవాలి కుంభవృష్ట కురవాలి
కురవాలి కురవాలి ముప్పయి రోజులముసురు
పట్టాలి పట్టాలి ముప్పయి రోజులముసురు
వానదేవుడా - వాన దేవుడా ॥



## 6. నాటేరమ్మ నాటేరు

సాంప్రదాయగీతం                    గానం ॥ యామిని, ప్రశాంతి

॥ ప ॥ నాటే రమ్మ నా టేరు -ఏమి మొక్క నాటేరు
జాజారమ్మ పూలతోటలో -జాజి మొక్క నాటేరు ॥

॥ చ ॥ సాగేనమ్మా సాగేను -ఏమి తీగ సాగేను
జాజారమ్మా పూలతోటలో -సన్నజాజి సాగేను ॥

॥ చ ॥ ఏసేనమ్మా ఏసేను -ఏమి సిగురు యేసేను
జాజారమ్మా పూలతోటలో -చామంతులు సిగురేసేను ॥

॥ చ ॥ తొడిగేనమ్మా తొడిగేను - ఏమి మొగ్గలు తొడిగేను
జాజారమ్మా పూలతోటలో - రోజా మొగ్గలు తొడిగేను ॥

॥ చ ॥ విచ్చేనమ్మా విచ్చేను - ఏమి పూలువిచ్చేను
జాజారమ్మా పూలతోటలో - సంపెంగలు విచ్చేను ॥

# 7. పండ్లోయమ్మ పండ్లు

రచన ॥ శ్రీ నాయిని సుబ్బారావు                గానం ॥ యామిని, మనోజ్ఞ

॥ ప ॥ పండ్లో యమ్మ పండ్లు
వరాలంటి పండ్లు
రండీ చూడండీ - కొనండీ - తినండీ బబ

॥ చ ॥ రకరకాల మామిడిపండ్లు
రమ్యమైన తాజాపండ్లు
సన్నాకులు , కలకటేరులు ,
జహంగీరులు , బేనీషాన్లు బబ

॥ చ ॥ రకరకాల నిమ్మపండ్లు
రమ్యమైన తాజా పండ్లు
గజనిమ్మ , మంచినిమ్మ , కమలాలు , నారింజాలు, ॥

॥ చ ॥ రకరకాల ద్రాక్షపండ్లు ,
రమ్యమైన తాజాపండ్లు
అక్రూట్లు, కిస్మిసీలు , అనాసపండ్లు , అరటిపండ్లు॥

॥ చ ॥ ఆపిల్సు , బొప్పాయిలు ,
అంజూర దానిమ్మ
సపోటాలు , జామిపండ్లు , పనస , పంపరపనస ॥



# 8.జొన్నల్లో పుట్టిన గౌరి

సాంప్రదాయ గీతం                గానం ॥ యామిని, సాయిచరిత

॥ ప ॥ జొన్నల్లో పుట్టిన గౌరీ -జొన్నల్లో పెరిగిన గౌరీ
అన్న వేసిన పొన్నలకింద - నేనువేసినా నిమ్మలకింద ।
చల్లంగ ఉండు సంపతి గౌరమ్మ - సంపతి గౌరమ్మా ॥

॥ చ ॥ వడ్లల్లో పుట్టిన గౌరీ - వడ్లల్లో పెరిగిన గౌరీ
కందుల్లో పుట్టిన గౌరీ - కందుల్లో పెరిగిన గౌరీ
అన్నవేసిన పొన్నలకింద - నేను వేసిన నిమ్మలకింద
చల్లంగ ఉండు సంపతి గౌరమ్మా - సంపతి గౌరమ్మా ॥

॥ చ ॥ పెసలలో పుట్టి న గౌరీ -పెసలలో పెరిగిన గౌరీ
మినుముల్లో పుట్టిన గౌరీ మినుముల్లో పెరిగిన గౌరీ
అన్నవేసిన పొన్నలకింద - నేను వేసిన నిమ్మలకింద
చల్లంగ ఉండు సంపతి గౌరమ్మా - సంపతి గౌరమ్మా ॥

॥ చ ॥ జనుముల్లో పుట్టిన గౌరీ - జనుముల్లో పెరిగిన గౌరీ
అనుముల్లో పుట్టిన గౌరీ అనుముల్లో పెరిగిన గౌరీ
అన్నవేసిన పొన్నలకింద - నేను వేసిన నిమ్మలకింద
చల్లంగ ఉండు సంపతి గౌరమ్మా - సంపతి గౌరమ్మా ॥

## 9. కోలు పలుకులు

రాచన ॥ శ్రీ మంగిపూడి పురుషోత్తమ శర్మ   గానం ॥ యామిని, ప్రశాంతి

॥ ప ॥ కోలు కోలు కోలు కోలు బాలల్లు కోలాటమాడుదామా
భరతుడేలిన మేటి గడ్డా , ఈ నేల అరకకట్టీదున్నుదామా
అరకచేతా బట్టి చురుకుగిత్తల గట్టి
కలుపుకర్రన లాగుదామా ॥

॥ చ ॥ మురువైనదీ పంట చెరువు - దీని దరులందు తీయమామిళ్ళు
సరి మించి కొబ్బెరల్ - పరువంపు పనసల్లు
పరిమెళారస దాడి తరులు ॥

॥ చ ॥ మంచి మంచి రాజనాలు గోధుమలు ఎంచదగిన ముత్తెసరులు
మించు రుచుల పంతగించేటి చెరుకుల్లు
మంచి జొన్నలు బొబ్బర్లు ॥

॥ చ ॥ చెల్లాయి తెచ్చిందిబువ్వ కడుపు చల్లంగ పంపే మా అవ్వ
బొల్లావు పెరుగు నీరుల్లి కారములుంటే
ఎల్ల సిరులూ చిల్లి గవ్వ ॥



## 10. గంగమ్మ తల్లికి

సాంప్రదాయగీతం   గానం ॥ ప్రణవి

॥ ప ॥ గంగమ్మ తల్లికీ చెంగల్వ పూదండ
కాళిందికీ తెల్ల కలువా దండ - తెల్లకలువా దండ ॥

॥ చ ॥ గోదారి తల్లికి గొజ్జంగీ పూదండ
సర సోతికీ సన్నజాజీదండ సన్నజాజీదండ ॥

॥ చ ॥ కృష్ణ వేణమ్మకీ గోదంగీపూదండ
కావేరికీ చంద్రకాంత దండ ॥

॥ చ ॥ గోదారి తల్లికీ కొట్టరా టెంకాయ
కోటి దండాలు మా గోదారి తల్లీ
పిల్లా జెల్లా నెల్ల సల్లంగా రచ్చించి
మమ్ము దయ సూడుము గోదారీ తల్లీ ॥

## 11. ఎందుకురా

సాంప్రదాయగీత   గానం ॥ యామిని , ప్రశాంతి

॥ ప ॥ ఎందుకురా ! ఎందుకురా !
ఎందుకు ఎందుకు ఎందుకురా ? ॥

॥ చ ॥ ఎండలు కాసేదెందుకురా
మబ్బులు పట్టేటందుకురా
మబ్బులు పట్టేదెందుకురా
వానలు కురిసేటందుకురా ॥

॥ చ ॥ వానాలు కురిసే దెందుకురా
చెరువులు నిండేటందుకురా
చెరువులు నిండేదెందుకురా
పంటలు పండేటందుకురా
పంటలు పండేదెందుకురా
ప్రజలూ బ్రతికేటందుకురా
ప్రజలూ బ్రతికేదెందుకురా
స్వామిని కొలిచేటందుకురా బబ

## 12. నెలవంక పడవనెక్కి

సాంప్రదాయగీతం　　　　గానం ॥ ప్రణవి

॥ ప ॥ నెలవంక పడవనెక్కి నీటుగాపోవంగా
నెలవంక నావంక నవ్వుతూ సూడంగా
జోర్ సెయ్ ! బార్‌సెయ్ ! జోర్‌సెయ్ ! ॥

॥ చ ॥ అద్దాల పడవనెక్కి అందంగా పోవంగా
అద్దాల్లో చందమామ ముద్దుగా సూడంగ ॥

॥ చ ॥ బంగారు పడవనెక్కి రంగూగపోవంగ
రంగు రంగుల చేపలో చెంగూ చెంగున గెంతగా
జోర్‌సెయ్ ! బార్‌సెయ్ ! జోర్‌సెయ్ ! ॥

॥ చ ॥ చుక్కాల పడవనెక్కి సూటీగ పోవంగ
సుక్కల్లో సెందురుడు చిందులు వేయంగ
జోర్‌సెయ్ ! బార్‌సెయ్ ! జోర్‌సెయ్ ! ॥



## 13. ఏలేలో హైలెస్సా

సాంప్రదాయగీతం　　　　గానం ॥ ప్రణవి

॥ ప ॥ ఏలేలో హైలెస్సా- ఏలేలో హైలెస్సా
నేలను నమ్మి ఏలేలో - చెట్టు ఉన్నది హైలెస్సా
చెట్టును నమ్మి ఏలేలో - కొమ్మ ఉన్నది హైలెస్సా ॥

॥ చ ॥ కొమ్మను నమ్మి ఏలేలో - రెమ్మ ఉన్నది హైలెస్సా
రెమ్మను నమ్మి ఏలేలో - తమ్మి ఉన్నది హైలెస్సా ॥

॥ చ ॥ తమ్మిని నమ్మి ఏలేలో - మొగ్గ ఉన్నది హైలెస్సా
మొగ్గను నమ్మి ఏలేలో - పువ్వు ఉన్నది హైలెస్సా ॥

॥ చ ॥ పువ్వును నమ్మి ఏలేలో - పింది ఉన్నది హైలెస్సా
పిందిని నమ్మి ఏలేలో - కాయ ఉన్నది హైలెస్సా ॥

॥ చ ॥ కాయను నమ్మి ఏలేలో - పండు ఉన్నది హైలెస్సా
పండును నమ్మి ఏలేలో - నువ్వు ఉన్నవు హైలెస్సా
నిన్ను నమ్మి ఏలేలో - నేను ఉన్నాను హైలెస్సా ॥

# 14. చందమామ రావె

సాంప్రదాయగీతం　　　గానం ॥ ప్రణవి

॥ ప ॥ చందమామ రావె - జాబిల్లి రావె
కొండెక్కి రావె - కోటివేలుతేవే ॥

॥ చ ॥ నట్టింట పెట్టవే - నా మాట వినవే
వెండిగిన్నెలో వెన్న - పైడి గిన్నెలో పాలు
అన్నము తెచ్చి అమ్మాయికి పెట్టవే ॥

॥ చ ॥ ఏవూరు ఏవాడ చందమామ - నీవు
ఏదారి తిరిగేవు చందమామ
పాలసంద్రంలోను పుట్టినావే కలువా
నీలాల బాటల్లో తిరిగేనే కలువా ॥

॥ చ ॥ హెచ్చు తగ్గులేల నీకు చందమామ - ఈ
మచ్చలేల నీకోయి చందమామ
కాల మహిమ దాటరానిదే కలువా
ఏల నా కథలన్నీ అడిగేనే కలువా ॥



# 15.నెలా నెలకు బాలుడవై

సాంప్రదాయగీతం　　　గానం ॥ యామిని, ప్రశంతి

ఓ చందమామయ్యోయ్ ! మా చందమామయ్యోయ్ !

నెలా నెలకు బాలుడవై
నెలకో మాటు రావడమై
మా అమ్మకు తమ్ముడవై
మాకు మేన మామవై
ఓ చందమామయ్యోయ్ ! మా చందమామయ్యోయ్ !

మా అందం మాకిచ్చి
నెయ్యంతో మము జూచీ
పాత వస్త్రం పుచ్చుకొనీ
కొత్త వస్త్రం ఇయ్యవోయ్
ఓ చందమామయ్యోయ్ ! మా చందమామయ్యోయ్ !

## 16. కిలకిలనవ్వులు

రచన ॥ శ్రీ పాలగుమ్మివిశ్వనాథం గానం ॥ ప్రశాంతి , యామిని

॥ ప ॥ కిలకిలనవ్వులు విరిసినపువ్వులు
ఆటలాడే పిల్లలు ఎంతో అందం
అల్లరి చేసే పిల్లలూ ఇంకా అందం ॥

॥ చ ॥ కొలనూ అందం కోవెలా అందం
కోవెల్లోని రాముడూ ఎంతో అందం
రాముడి పక్కన సీతమ్మా ఇంకా అందం ॥

॥ చ ॥ చెరువులూ అందం దొరువులూ అందం
చెరువుల్లోనీ తామరపువ్వులు ఎంతో అందం
దొరువుల్లోనీ చేపపిల్లలు - ఇంకా అందం ॥

॥ చ ॥ మబ్బులూ అందం చందురూడు అందం
మబ్బులూ కురిసేటీ వానా అందం
చందురూడూ కురిసేటి వెన్నెల అందం ॥



# జేజి మామయ్య పాటలు

## 1. రారె చిన్ని పిల్లలార

గానం ॥ యామిని, ప్రశాంతి, తేజస్వి

రారె చిన్ని పిల్లలార - రారె చిట్టి తల్లులార
ఆట పాట లెన్నొ కూడి ఆడి పాడుదాముగా ॥

దాచుకోండి పుస్తకాల్ - పాఠములిక చాలుచాల్
చేయి చేయి కలిపి చెంగున పరుగెత్తి రారె ॥

కొండమీద చందమామ - వెండిగిన్నె తేలునే
చద్దిబువ్వలోకి వెన్న ముద్దలెన్నొ రాలునే ॥

అక్క మనకు తల్లిగాక - అందరమూ ఒకటికాగ
చల్లనైన వెన్నెలందు తెల్లవారు లాడగా ॥

ఇంట నుండనేల - ఇటు
వంటి సంజవేళ - విహరింపగ రావేల - రావేలా ॥

చక్కని మైదానాల - చల
చల్లగాలి ఊల - మెల మెల్ల పాడేవేళ - రావేల ॥

మరుసంజ వెల్గు చాల
చెక్కుటద్దాల పోల చిరునవ్వు నవ్వేవేళ రావేల ॥

అందాల నేలు పూల
గందంపు పొడులురాల కమ్మదనాల తేల రావేల ॥

# 2.కాకీ, కాకీ, హాష్

గానం ॥ యామిని, ప్రశాంతి

కాకీ, కాకీ, హాష్
కాకీ, కాకీ,రాకే, రాకే,
పాపాయి బువ్వ తింటోందే
కాకీ, కాకీ, హాష్ ॥

వెండి గిన్నెలో పప్పూ బువ్వా
గుంజు గుంజు గుంజు గుంజు
గోరు, గోరు, గోరు, గోరు ॥

కంచం అంచున రాసీ,
గోరూ గుజ్జూ తీసీ
గుజ్జూ నోటికి పూసీ
బుజ్జీనోటా అం ॥

అత్తా ముద్దా ఆ ---
ఆ ఆ --- అం
అమ్మా ముద్దా ఆ---
ఆ --అం ॥

నాన్నా ముద్దా ఆ ----
ఆ - అం
కాకీ,కాకీ, రావే,రావే,
బుజ్జీ ముద్దా తిని పోవే ॥



# 3. మ్యావు మ్యావు పిల్లి

గానం॥ సాయిదరహాస్

మ్యావు మ్యావు పిల్లీ - రావె రావె పిల్లీ
ఈ బువ్వ కాస్త తినిపోవే ॥

గోరు వెచ్చపాలూ - గుజ్జు వెన్నపూసా
బొజ్జనిండా నింపుకొని పోవే ॥

మ్యావు మ్యావు పిల్లీ - రావె రావె పిల్లీ
ఈ బువ్వ కాస్త తినిపోవే ॥

హాసి దొంగ పిల్లీ - మీసాలపైనీ
పాల చుక్కలెందుకొచ్చాయే ॥

పాలగిన్ని మీదీ - పళ్లేన్ని కిందా
పడగొట్టి మూల చేరావా ॥

మ్యావు మ్యావు పిల్లీ - పోవే పోవే పిల్లీ
ఈ బువ్వ నీకు కాదు లేవే ॥

# 4. పాలపిట్ట రావె

గానం ॥ యామిని

పాలపిట్ట రావే - పలుకాడి పోవేబబ

చిన్ని రెక్క చేతులు పరచీ - సన్న యెలుగులో మైమరచీ
ఆకసాన తేలీపోతూ - అల్ల నల్ల యెగిరీ రావే బబ

తంతి తీగపైనా నిలిచీ - వింత లేమి చెప్పతావే
రైలుబండి గూటీలోనా - వాలీ నేను చూచూచుండబబ

చిన్ని తోక కదిలీ ఆడా - చిన్ని గొంతు పాటా పాడా
పాట పైకి రాకమునుపే - దాటు వేసి యెగురూతావేబబ

## 5. ఉడతా ఉడతా

గానం ॥ తేజస్వి

ఉడతా ఉడతా హూత్
పిడతాకిందీ శలగా పప్పూ
పెడతా పెడతా రావే రావే ॥
మిడుతూ మిడుతూ మంటూ చూస్తూ
పడుతూ లేస్తు, పాకీ దుమికీ
కొబ్బరిమట్టా కొసనూ కూచుని
కొరికేదేం పిందే ॥

కుచ్చుతోకను చేర్లబడుతూ
కూచుని వెనక కాళ్ల పై కుదురుగ
ముంజేతుల్లో కొబ్బరి పుచ్చే
ఎంచక్కా తింటావే ॥

చొచ్చో చొచ్చో చొచ్చో అంటూ
గోడలు చెట్లూ మేడలు మిద్దెలు
నిచ్చెన లేకే ఎక్కేస్తూనే
ఏం వెదుకుతావే ॥

పరపరపిందే కొరికీ వేసీ
తొరతొరగానూ మింగీ మీసాల్
వెనక్కితోసీ ముందుపళ్లతో
వెకిలినవ్వు నవుతావే ॥



## 6. బాతు నేస్తం

గానం ॥ తేజస్వి

క్వాక్వాక్వా క్వాక్వాక్వా క్వాక్వా

ఓహో బాబూ ఓహో పాపా
ఎక్కడి కెడుతున్నారర్రా - అని
బర్లో కెళ్ళే బాబుని పాపని దార్లో ఒక బాతడిగింది

పాఠం చేప్పే పంతులు గారికి
పళ్ళియడానికి వెడుతున్నామని
బాతుభాషలో పాపంటే విని బాబు పకాలున నవ్వాడు

చిట్టిచేతిలో పళ్ళుపుచ్చుకొని
పొట్టికాళ్ళతో గున గున ఊగుతు బాతుల్లాగే పోతున్నారే
నాతో నేస్తం కడతార అని
బర్లోకెళ్ళే బాబుని పాపని
దార్లో ఆ బాబుడిగింది
నేస్తం నీతో కడితే మాకేమిస్తావో చెపుతావా బాతూ

క్వా క్వా క్వా క్వా క్వా క్వా అంటూ
బాతుభాషలో పాపంటే విని బాబు పకాలున నవ్వాడు

బర్లో కెడుతూ నేస్తం కడితే
దార్లో సాయం వస్తానర్రా
చెర్లో తామర లిస్తా నర్రా
బర్లో పంతులు కివ్వండంటూ
బర్లో కెళ్ళే బాబుని పాపని దార్లో ఆ బాతడిగింది

క్వాక్వా అంటుందేమిటి బాతూ
అక్కా అని బాబడిగా డప్పుడు
క్వాక్వా అంటే గమత్తు కాదూ చక్కని బాతు భాషరా అదీ

క్వాక్వాక్వా క్వాక్వాక్వా క్వాక్వా
బాతు భాష అని పాపంటే విని బాబు పకాలున నవ్వాడు
బర్లోకెళ్ళే బాబూ పాపా బాతూ నేస్తం కట్టారు

## 7. కర్ర గుర్రం

గానం ॥ ప్రశాంతి

సిపాయి ఎక్కేదీ యెర్రాగుర్రం
మా పాపాయి ఎక్కేదీ కర్రాగుర్రం బబ

పారీపోతుందీ సిపాయీ గుర్రం, ఓహో
కట్టీ పడుంటుందీ కర్రాగుర్రం
ఊళ్ళన్నీ వెళ్ళూ సిపాయీ గుర్రం,
మరి ఉయ్యాలలూగూ పాపాయీ గుర్రం బబ

గోలేలతో నీళ్ళు గరికాలూ గుగ్గిళ్ళూ
చాలా కోరేదీ సిపాయీ గుర్రం
గుగ్గిళ్ళూ అడగాదు, గరికాపో చడగాదు
నీళ్లయినా అడగాదు కర్రాగుర్రం బబ

ఒకసారీ ఎక్కేసీ ఊరేగీ రాగానే
ఉస్సూరంటుందీ సిపాయీ గుర్రం,
ఎన్నిసార్లెక్కినా ఎంతసేపూగినా
ఏమీ అలిసీపోదూ కర్రాగుర్రం ॥



## 8. మూడు చక్రాల సైకిల్

గానం ॥ సాయిదరహాస్

చక చకా పోతోంది మూడు చక్రాలా సైకిల్

ముందు చెల్లినీ కూచోపెట్టీ
వెనక అక్కనీ కూచో పెట్టీ
నడమ ఠీవిగా తాను కూచొనీ ॥

జడుపూ గిడుపూ లేని బాబూ
షోకుగా ఒకసారి వంగీ
ఠీకుగా తలయెత్తి తొక్కగా ॥

పక పకా నవ్వింది అక్కా
కిలాకిలా నవ్వింది చెల్లీ
నడుము వంపులు తిప్పకొంటూ
వడి వడి వడిగ ఒకసారి మెల్లని నడకతో ఒకసారి త్రొక్కగా ॥

సందు అంతా రాకపోకల సందడెక్కిన రాచబాట
ముందువున్నా చెట్టుచేమా వెళ్లిపోడం వెనక్కేట
కొండమీదీ జేజిమామయ కూడ పరుగున తోడురాగా ॥

## 9. గాలిపటం

గానం ॥ యామిని, ప్రశాంతి

ఆకాశంలో గాలిపడగ
అందంగా యెగిరే ఓ పడగ ॥॥

తెలుపూ పసుపూ ఎరుపూ నీలం
కలకల లాడే రంగుల పడగ
పైకీ కిందికి పక్కల కూగుతు
బారుగ తేలీ ఆడే పడగ ॥॥

కుచ్చులు కట్టిన అమ్మాయిజడలా
ముచ్చటగా తూగాడే తోకా
భాగవతంలో భామముఖంలా
అవునవు నన్నట్లాడే పడగ ॥॥

నడుమ బొడ్డులో కట్టిన దారం
పొడవై సాగగ పైకి వదులుతూ
గాలి కెదురుగ పరుగులు పెట్టుతు
బాలుడు తలెత్తి చూసే పడగ ॥॥



## 10. బొంగరం

గానం ॥ టి. కె. తేజస్వి

చుట్టూ చుట్టూనతాడు వీడి
కట్టువదిలిన కోడెలాగా
చెంగుమంటూ చేయిజారీ
రింగుమంటూ నేలవ్రాలీ ॥

గిర గిర గిర గిర తిరిగిపోతూ
చర చర చర చర జరిగిపోతూ
వ్రాసేదేమే నేలమీద,
గీసేదేమే బొంగరమ ॥

నిట్టనిలువున కదలకుండా
నిబ్బరంగా కొంతసేపూ
అట్టూ ఇట్టూ ఆడిపోతూ
ఆదరా బాదరా కొంతసేపూ ॥

అల్లా గల్లా ఊగిపోతూ
వెల్లకిల్లా దొర్లిపోతూ
వ్రాసేదేమే నేలమీద,
గీసేదేమే బొంగరమ ॥

ఎప్పుడు బడికీ పోయినావే
ఏమి పుస్తకాల్ చదివినావే
ఎల్లావచ్చిందింత చదువూ
ఏమో చెప్పవె బొంగరమ ॥

# 11. ఆటలు ఆడీ

గానం ॥ సి. లావణ్య

ఆటలు ఆడీ పాటలు పాడీ అలసీవచ్చానే
తియ్యా తియ్యని తాయిల మేదో తీసీ పెట్టమ్మా ॥

పిల్లీ పిల్లా కళ్ళూ మూసీ పీటా ఎక్కిందీ
కుక్కా పిల్లా తోకాడిస్తూ గుమ్మామెక్కిందీ
కడుపూలోనీ కాకీ పిల్లా గంతూలేస్తోందీ
తియ్యాతియ్యని తాయిలమేదో తీసీ పెట్టమ్మా ॥

గూటీలోనీ బెల్లం ముక్కా కొంచెం పెట్టమ్మా
చేటాలోనీ కొబ్బరి కోరూ చేరెడు తియ్యమ్మా
అటకా మీదీ అటుకుల కుండా అమ్మ దింపమ్మా
తియ్యా తియ్యని తాయిలమేదో తీసీ పెట్టమ్మా ॥

# 12. చందమామ బోటు

గానం ॥ ప్రశాంతి , యామిని.

చందమామ బోటులో
అందమౌ మిన్నేటిలో
చల్లగాలి షికారు పోవుదమా
వెన్నెల రేయి ॥

తీయ పాటలు పాడుతూ
హాయి నోల లాడుతూ
దివ్వలోకాల్ దాటిపోవుదమా
వెన్నెల రేయి ॥



పూల తావుల సోలుతు
తూలు తేనెలు గ్రోలుతూ
తేలుతూ షికారు పోవుదమా
వెన్నెల రేయి ॥

# 13. చలి చలి చామక్క

గానం ॥ యామిని, ప్రశాంతి

చలిచలి చలిచలి చామక్క
కుంపటితేవే గురవక్క
పొలి పొలి పొలి పొలి పొలిగాడా
గంపలు నింపర గురవయ్యా ॥

పిట్టల కెగరెయ్ పిడికిళ్లు
బిచ్చగాళ్లకెయ్ దోసిళ్లు
కుప్పల నూర్చిన ధాన్యాలు
రాసులుపోయర రంగయ్యా ॥

కితకిత కితకిత కిష్టయ్యా
గంతులు వేయకు రాధక్కా
దులపవే పావడ కుచ్చెళ్లు
చలి మంటల్లో గొబ్బిళ్లూ ॥

చురుకు రక్తపూ పరుగుల్లో
చుట్టూ మూగిన మనవల్లు
తాత చుట్ట పొగ సుడులల్లో
కంబళి ముసుగున కథలల్లు ॥

# 14. భోగి పళ్లు

గానం ॥ యామిని , ప్రశాంతి

చిట్టీ చిట్టీ రేగీపళ్లూ
చిట్టీతలపై  భోగీపళ్లూ
ఎంతో చక్కని భోగీపళ్లూ
ఎర్రా ఎర్రని రేగీపళ్లూ ॥

ఘల్లూ ఘల్లున దమ్మడీలు
జల్లుగ అల్లో నేరెడి పళ్ళూ
తళ తళ తళ తళ లాడీపోతూ
తలపై ఎన్నో దొర్లీపోతయ్ ॥

పెద్దల దీవన లెన్నో పూలై
ముద్దులు తియ్యాతియ్యని పళ్లై
తళతళ తళతళ లాడీపోతూ
తలపై ఎన్నో దొర్లీపోతయ్ ॥

పసుపూ గంధం అరటి పళ్లతో
మిసమిసలాడే పట్టుచీర్లతో
ముత్తైదువులా గాజుల సడిలో
ఎత్తున రాలే భోగీ పళ్ళూ ॥



# 15.పల్లకీ పాట

గానం ॥ యామిని, ప్రశాంతి

ఓహో ఓహో హోం ఓహో ఓహోం
ఓహో ఓహో హోం ఓహో  ఓహోం

తర్లీ వెళ్లే పెళ్లికొమారుని పల్లకియా
పెళ్లి కొమారిత సవారియా  ॥

అత్తింటికి చను కొత్తకోడలి సవారియా
పుత్తడి పూవుల పోహళించన సవారియా  ॥

ముత్యాల పల్లకి మేనా సవారీ ఆగవే
బోయీల పాటల హాయిగ తేలుచు సాగవే  ॥

# 16. బొమ్మల కొలువు

గానం ॥  ప్రశాంతి, యామిని.

కొలువూ పేరంటానికి రారమ్మా
మా ఇంట్లో బొమ్మల కొలువూ,
పేరంటానికి రారమ్మా ॥

అట్ట బొమ్మలూ మట్టిబొమ్మలూ
ముచ్చిచేసిన లక్క బొమ్మలూ
అందమైన పింగాణి బొమ్మలూ
రంగు రంగులా గాజు బొమ్మల ॥

కొయ్యబొమ్మలూ దంతపు బొమ్మలు
కంచుబొమ్మలూ గంధపు బొమ్మలు
ఏటి కొప్పాక నాటు బొమ్మలూ
కొండపల్లిలో కొత్తబొమ్మలూ ॥

కొండలు నదులూ జలపాతాలూ
కోటలు పేటలు వంతెన బాటలు,
మెయిళ్లుపోయే రయిలుదారులూ
ఏరోడ్రోములు గాలివిమానాల్
పట్నవాసములు పల్లెగూడెములు
పోలీస్ ఠాణా తాలింఖానా
పొలాలు, తోటలు, హోటళ్లు పార్కులు
రక రకాల మనుషుల బొమ్మల ॥

ఆటలు ఆడే స్టేడియమూ
నాటక శాలా సినిమాహాలూ
చిత్రవస్తువుల మ్యూజియమ్ములూ
చేపలతొట్టెలు జంతువనములూ
బజారులూ అంగడులూ బడులూ
దేవుడి గుడి దేవుడి కోనేరు ॥



## 17. కాగితపు పడవ

గానం ॥ ప్రశాంతి, యామిని

సాగుతోందిరా పడవ
సాగుతోందిరా
కాగితంపు చిన్ని పడవ
సాగుతోందిరా ॥

చిట్టిచెల్లి, నేను కలసి
కట్టుకున్న చిన్నిపడవ
తెరచాపా, చుక్కానీ
తెడ్డు లేక తొరతొరగా ॥

ధారలుగా కురియు వాన
ఏరులుగా దారిలోన
తారి తారి, వూరి వూరి
చేరి పారు కాల్వలోన

సుడులలో తడబడీ
జడులలో వడి వడీ
బడలకే వయారమైన
నడలతోడ పరువిడీ

## 18. కప్పల బడి

రాగం ॥ టి.కె. తేజస్వి

కరరవ రట్ మరరవ రట్
గడబిడ చేస్తోంది కప్ప

గొంతుకలో జంతికలా - గుబ గుబమని ఆడంగా
రబ్బరు బుడగలా పొట్ట - ఉబ్బి ఉబ్బి సన్నగిల్ల
మోరచాచి దేవుడితో - మొరపెడుతోందేమేమని ॥

మడుగుల్లో, బావుల్లో, - దొరువుల్లో చెరువుల్లో
నీళ్లుచెరి పొర్లిపారి - కళ్ళా లన్నీ నిండగ
సర సర సర వానజల్లు
కురు కురుమని మొరపెడుతూ ॥
బడి మానిన ఆకతాయి - దడ దడమని గొడవ చేసి
చిట్టి చిట్టి రాళ్లు తీసి - చెదరగొట్ట చూడగాను
జీవహింస చేయు నిన్ను
దేవుడు శిక్షిస్తాడని ॥

నడుమనున్న పెద్ద కప్ప - బడిపంతులు గారేమో
వద వద మను చిరుకప్పలు - చదివే బడి పిల్లలేమో,
చెరువే ఒక బడియేమో
చెపుతున్నది పాఠమేమో ॥



## 19. వంకరటింకర సో

గానం ॥ టి. కె. తేజస్వి

వంకర టింకర సో
వానీ తమ్ముడు అ
నల్లాగుడ్లా మీ
నాలుగుకాళ్లా మే ॥

పప్పూసరుకుల తిండీ హెచ్చీ
పిప్పలి బస్తా కడపూ నొచ్చీ
కొంకరపోయీ నాలూక వుంటే
కొరొక్కుతింటే చురుక్కుమంటూ ॥

మాటల్లోనూ ఘాటునుచేర్చీ
మందపు ఆకలి మాపే శొంఠీ
భావంలోనూ కారం కూర్చీ
నోరూరించే తల్లే అల్లం ॥
తుబుక్కు తుమ్మే జలదోషంలో
కంటా ముక్కూ జడివానల్లో
గొంతూ సుంతా పెగలక పోతే
నసాళమంటే మసాళ మిరియం ॥

నవ్వూ రాకా ఏడుపు రాకా
నాలుగు దిక్కుల చూపులు పోకా
గిలిగింతలకే కదలని డొక్కా
కలిగిన మనిషీ మెమ్మె మ్మేకా ॥

## 20. చెడుగుడు

గానం ॥ సాయిదరహాస్

చెట్టుకొట్టగా పాలుకారగా
నిన్ను కొట్టగా నీరుకారగా
చెన్నాపట్నం దుర్రుచ్చి, దుర్రుచ్చి, దుర్రుచ్చి ॥

మట్టికొట్టగా దుమ్ము రేగగా
నిన్నుకొట్టగా నేయి కారగా
విశాఖపట్నం వెర్రొచ్చి, వెర్రొచ్చి , వెర్రొచ్చి ॥

కొమ్మ కొయ్యగా పలక తేరగా
నిన్ను కొయ్యగా నిగ్గుతేరగా
కళింగపట్నం కిర్రుచ్చి , కిర్రుచ్చి , కిర్రుచ్చి ॥

పుట్టి తొయ్యగా గట్టుచేరగా
నిన్ను తొయ్యగా ఊరుచేరగా
మచిలీపట్నం రేవొచ్చి , రేవొచ్చి , రేవొచ్చి ॥

చెట్టుకొట్టగా పాలుకారగా
నిన్ను కొట్టగా నీరుకారగా
చెన్నాపట్నం దుర్రుచ్చి, దుర్రుచ్చి, దుర్రుచ్చి ॥



## CREDITS

పాడిన చిన్నారులు :
ప్రణవి
తేజస్వి
యామిని
ప్రశాంతి
మనోజ్ఞ రాజగోపాల్
సాయిచరిత
మనస్విని
సింధుజ
శరత్ సంతోష్
రోహిత్
సాయిదరహాస్
అనిరుధ్
లావణ్య
సాహితి
శ్రావణి
ఆకాంక్ష

వాద్య సహకారం అందించిన కళాకారులు :
కీ బోర్డు-వినోద్ బాబు
వేణువు-రామచంద్రమూర్తి
తబలా-శివశంకర్ & పవన్
ప్యాడ్స్-నవీన్ & ప్రశాంత్

స్టూడియో :
విపంచి డిజిటల్స్,
ఆదర్శ్ నగర్, హైదరాబాద్.

సౌండ్ ఇంజనీర్ :
విశ్వనాథ్

రూపకల్పన - నిర్వహణ :
పాలగుమ్మి విశ్వనాథం

సహకారం :
హేమవతి



## About Saptaparni:

Saptaparni is a cultural center with a special focus on children in the area of traditional art, music, crafts and literature. It is a concept that has been devised to provide children in today' s world an alternative space for leisure and learning, interaction and introspection. It provides an ideal learning environment for parents and children alike, to get acquainted with unique ways of relaxation and inter-generational bonding. The emphasis is on activities that revive long forgotten Indian traditions and evoke the rich cultural diversity of our heritage.

Saptaparni

Plot No. 21, Road No. 8, Banjara Hills,
HYDERABAD - 500 034.
Ph : 66667707, 66821789
Email : mail@saptaparni.com

Rs. 20/-